


తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!

www.vaarhtanirbhayam.com

ఎడిటర్ కాడేపాగు అశోక్

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ



తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 187 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజిలు : 04, వెల రూ. 4రూ/ బుధవారం- 03 - జున్ - 2026

Published From Kurnool : Circulated at `Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,

## ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం



**వేసవి కాలం.. అందునా రోహిణి కార్తె కావడంతో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో రుతుపవనాల ప్రవేశానికి ఇంకా సమయం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ వెల్లడించింది.**

విశాఖపట్నం, జూన్ 02: వేసవి కాలం.. అందునా రోహిణి కార్తె కావడంతో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో రుతుపవనాల ప్రవేశానికి ఇంకా సమయం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో తీవ్రమైన ఎండలు, గాలిలో తేమ లేకపోవడంతోపాటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అలాంటి వేళ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మిగతా..2లో

## తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరు.. నీ అయ్యా జాగీరు కాదు: పొన్నం



**తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరు.. నీ అయ్యా జాగీరు కాదంటూ జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు.**

హైదరాబాద్, జూన్02: తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరు.. నీ అయ్యా జాగీరు కాదంటూ జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్ వేదికగా స్పందించారు. మిస్టర్ పవన్ కల్యాణ్.. మిగతా..2లో

### పవన్ కల్యాణ్ పై మహేష్ కుమార్
## గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు


2

★ నటుడిగా పవన్ ను ఇష్టపడతామన్న మహేష్ గౌడ్

★ రాజకీయపరంగా వ్యతిరేకిస్తామని వెల్లడి

★ పవన్ ను తెర వెనుక నుండి ఎవరో వ్యక్తులు నడిపిస్తున్నారని వ్యాఖ్య

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి

## ఓట్ల గల్లంతుపై మీడియా దృష్టి పెట్టాలి

▶▶ అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న మల్లు భట్టి

▶▶ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రత్యర్థులే లేరని వ్యాఖ్య

▶▶ బీజేపీ రైతు వ్యతిరేక పార్టీ అని విమర్శ



హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాలని, అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ 'ఎస్ఐఆర్ మ్యాపింగ్' అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆయన కోరారు. సచివాలయంలో జరిగిన తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై ఆయన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అసలు ప్రత్యర్థులే లేరని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ తీరును తప్పుబడుతూ.. "భారతీయ జనతా పార్టీ పక్కా రైతు వ్యతిరేక పార్టీ" అని ఆయన దుయ్యబట్టారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే ప్రభుత్వాలకు, పార్టీలకు ప్రత్యేకంగా ప్రచారం అవసరం లేదని.. తాము చేసిన పనులే మాట్లాడతాయని చెప్పారు. ఇప్పటికే జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా ఏంటో నిరూపించుకుందని ఆయన గుర్తుచేశారు. ఇదే క్రమంలో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం త్వరలోనే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క వెల్లడించారు.

### తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా?
## రావొద్దనడానికి మీరెవరు


2లో..

★ తెలంగాణలో ఇకపై జనసేన పోటీ చేస్తుందని పవన్ ప్రకటన

★ బెదిరింపులకు, హెచ్చరికలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ

★ చెరువు కబ్జా ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్

★ తాను తెలంగాణకు వ్యతిరేకం కాదని, విభజన తీరునే తప్పుపట్టానని వెల్లడి

### నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై
## స్పందించిన భారత్


2

★ ఇరు దేశాల మధ్య ఉన్న ఏవైనా విభేదాలను పరస్పర చర్చల ద్వారా, చారిత్రక ఆధారాల ఆధారంగానే పరిష్కరించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.


★ ప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరిపామని నేపాల్ ప్రధాని బాలేంద్ర షా పార్లమెంటులో వెల్లడించారు.

### భారత్-నేపాల్ సరిహద్దు వివాదం
## మూడో పక్షం జోక్యానికి నో ఛాన్స్

● నేపాల్‌తో బార్డర్ విషయంపై స్పందించిన భారత్

● పొరుగు దేశం నేపాల్‌తో సరిహద్దు వివాదాల పరిష్కారానికి తృతీయ పక్షాలు అవసరం లేదని వెల్లడి

● ఇరు దేశాల ద్వైపాక్షిక యంత్రాంగాలు ఉన్నాయన్న ఇండియా



2లో..

ఢిల్లి : నేపాల్, భారత్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదాల పరిష్కారానికి చైనా, యూకేల ప్రమేయం ఉండాలని నేపాల్ ప్రధాని బాలేంద్ర షా చేసిన వ్యాఖ్యలపై ఇండియా స్పందించింది. నేపాల్‌తో ఉన్న సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడంలో తృతీయ పక్షాల పాత్రను భారత్ తిరస్కరించింది. సరిహద్దు సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరించుకోవడానికి ఇరు పక్షాలు ద్వైపాక్షిక యంత్రాంగాలను ఏర్పాటు చేసుకున్నాయని తెలిపింది. భారత్- నేపాల్ బార్డర్‌లో దాదాపు 98 శాతం గుర్తించామని పేర్కొంది.

### దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు ఢిల్లీలో
## సమావేశమవుతాయి

● బంగాల్ ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్ చేసి గెలుపొందిందని ఆరోపించిన మమత బెనర్జీ

● బీజేపీ విజయం అనంతరం వీజ శ్రేణులపై దాడులను ఖండించిన మమత


2లో..

ఢిల్లి : బంగాల్ ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్ చేసి విజయం సాధించిందని తృణముల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్రమైన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని 294 అసెంబ్లీ స్థానాల్లో 177 చోట్ల కమలం పార్టీ ఓట్ల లెక్కింపులో రిగ్గింగ్ చేసిందని కోల్‌కతాలో చేపట్టిన ధర్నాలో మమత తెలిపారు. తన జీవితంలో ఎవరికైతే తాను అండగా నిలిచానో వారే ఇప్పుడు ఒక ద్రోహితో చేతులు కలపడం విచారంగా ఉందని సీఎం సువేందు అధికారిని ఉద్దేశించి ఆమె వ్యాఖ్యానించారు. అలాగే, వచ్చే వారం జరగనున్న ఇండియా బ్లాక్ సమావేశాన్ని ప్రస్తావిస్తూ, దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు ఢిల్లీలో సమావేశమవుతాయని తెలిపారు. "పోలీసులు మా నాయకులను బెదిరిస్తున్నారు. చందన్‌నగర్ పోలీస్ కమిషనర్ మా నాయకుడికి ఫోన్ చేసి రాజీనామా చేయాలని,

### తెలంగాణలో జనసేన ఉంటుంది
## మేం పోటీచేసి తీరతాం


2

★ నేను ఇప్పటివరకు ఒక్క తెలంగాణ నాయకుడినీ ఒక్క మాట అనలేదన్న పవన్

★ రెచ్చగొట్టడం ఇష్టం లేదు, ఎన్నోసార్లు తగ్గి ఉన్నానని స్పష్టం

★ విశ్లేషకుడి వ్యాఖ్యల వల్ల గొడవ మొదలైందని వెల్లడి


హైదరాబాద్: నేను ఇప్పటివరకు ఒక్క తెలంగాణ నాయకుడిని కూడా ఒక్క మాట అనలేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. నాకు రెచ్చగొట్టడం ఇష్టం లేదు, అందుకే ఎన్నోసార్లు తగ్గి ఉన్నానని పవన్ స్పష్టం చేశారు.

### రాజమహేంద్రవరం మెగాసిటీగా మారేలా
## అభివృద్ధి పనులు చేపట్టాలి

● గోదావరి పుష్కరాలపై వివిధ శాఖలతో సీఎం చంద్రబాబు సమీక్ష

● అఖండ గోదావరి ప్రాజెక్టుపై మంత్రుల కమిటీతో సమగ్రంగా చర్చించిన సీఎం

● పవన్ కల్యాణ్ సూచనలు కూడా పరిగణనలోకి తీసుకుని పనిచేయాలని ఆదేశం



అమరావతి : గోదావరి పుష్కరాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్నిశాఖలు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గోదావరి పుష్కరాల నిర్వహణపై, సీఎం వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదావరి నది రాష్ట్రంలో 212 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తోందని పోలవరం జిల్లా గుండాలలో మొదటి పుష్కర ఘాట్, కోనసీమ జిల్లా అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలోని గోవాలంక, పశ్చిమగోదావరిలోని నర్సాపురంలో చివరి ఘాట్ నిర్మాణ ప్రతిపాదనలు చేసినట్లు అధికారులు వివరించారు. మొత్తం 6జిల్లాల్లో 525 ఘాట్లను పుష్కరాల కోసం సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిగతా..2లో

### రాజధాని పేరుతో స్కాం..
## రైతులకు అండగా ఉంటా!

➤ అమరావతి రాజధాని పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తాడేపల్లి పార్టీ కార్యాలయంలో జగన్‌తో భేటీ

➤ మన ప్రభుత్వం వచ్చాక రైతులకు ఏం కావాలో అదే చేస్తాం.

➤ రైతులకు సంతోషపెట్టేలా ఏదైనా జరగాలి.. వారిని కష్టపెట్టేలా ఏమీ ఉండకూడదుదని జగన్ అన్నారు.



అమరావతి :రాజధాని పేరుతో చంద్రబాబు ఏది చేసినా స్కామే కనిపిస్తోంది అన్నారు మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్. అమరావతి రాజధాని పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తాడేపల్లి పార్టీ కార్యాలయంలో జగన్‌తో భేటీ అయ్యారు. మిగతా చోట్ల చదరపు అడుగుకు మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

## ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం

మంగళవారం ఉరుములు మెరుపులతోపాటు పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. విశాఖపట్నం, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, పార్వతీపురం మన్యం, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు విజయనగరం, విశాఖపట్నం, మన్యం అల్లూరి, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, అనకాపల్లితోపాటు ఉభయ గోదావరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. దీంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు స్పష్టం చేసింది.

### రాజధాని పేరుతో స్కాం..

## రైతులకు అండగా ఉంటా!

అత్యధికంగా రూ.4500 అవుతుంటే అమరావతిలో రూ.20వేలు ఖర్చు చేస్తూ రూ.20కోట్లు అయ్యే రోడ్డుకు రూ.53 కోట్లు అంటూ అవినీతి చేస్తున్నాడు అన్నారు. ఈ పెట్టే ఖర్చులో కొంత మావిగన్ కు పెడితే రాజధాని ఇప్పుడే సిద్ధం అవుతుంది. మన ప్రభుత్వం వచ్చాక రైతులకు ఏం కావాలో అదే చేస్తాం. బలవంతపు భూసేకరణ అనేది ఉండదు. అలాగే రాజధాని రైతులకు అవసరమైన న్యాయ సహాయాన్ని కూడా అందిస్తాం అన్నారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాం. రైతులకు సంతోషపెట్టేలా ఏదైనా జరగాలి.. వారిని కష్టపెట్టేలా ఏమీ ఉండకూడదుదని జగన్ అన్నారు. మొదటి తీసుకున్న 50వేల ఎకరాలకే దిక్కులేదు.. ఇప్పుడు మళ్లీ 50వేల ఎకరాలని సీఎం చంద్రబాబు నాయుడు అంటున్నారు. అందుకే ప్రత్యామ్నాయంగా మావిగన్‌ను సూచించామని జగన్ పేర్కొన్నారు. వైఎస్ జగన్ ను కలిసిన తరువాత రాజధాని రైతులు మాట్లాడుతూ.. మా బాధలు చెప్పుకోవడానికి ఎవరూ ఉండటం లేదు. ఎమ్మెల్యే, మంత్రి, అధికారులు ఎవరూ కలవడానికి అవ్వడం లేదు అని చెప్పుకొచ్చారు. ఉండవల్లిలో పండని పంటలు లేవు.. అలాంటి పొలాలను ఇవ్వడానికి మేము సిద్ధంగా లేము. ఏడాది పొడవునా పంటలు పండుతాయి. ఎకరానికి 3లక్షలు సంపాదిస్తాం అన్నారు. మా బాధలన్నీ వైఎస్ జగన్ కు చెప్పుకున్నాండ. భూసేకరణ నుండి మా భూములు తప్పించండని వేడుకుంటున్నాం అన్నారు.

### పవన్ కల్యాణ్ పై

## మహేష్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పవన్ కల్యాణ్‌పై తనకు ఉన్న వ్యక్తిగత అభిమానానికి, రాజకీయాలకు మధ్య స్పష్టమైన తేడా ఉందని ఆయన పేర్కొన్నారు పవన్ కల్యాణ్‌ను ఒక నటుడిగా తామంతా ఇష్టపడతామని, అయితే రాజకీయ పరంగా మాత్రం ఆయనను తీవ్రంగా వ్యతిరేకిస్తామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. “పవన్ కల్యాణ్ ఆంధ్ర మూలాలు ఉన్న నాయకుడు. నటుడిగా ఆయనపై మాకు గౌరవం ఉంది, కానీ రాజకీయంగా మేము ఆయనతో విభేదిస్తాం“ అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్‌లో ఉపముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ.. ఆయనను తెరవెనుక నుంచి ఎవరో వేరే వ్యక్తులు నడిపిస్తున్నారని ఆరోపించారు.

### భారత్-నేపాల్ సరిహద్దు వివాదం

## - మూడో పక్షం జోక్యానికి నో ఛాన్స్

ఈ మేరకు వారాంతపు ప్రెస్ మీట్‌లో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. “సరిహద్దు విషయాలకు సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరించుకోవడానికి భారత్, నేపాల్ కృషి చేస్తున్నాయి. అందుకోసం ఇరుదేశాలు ద్వైపాక్షిక యంత్రాంగాలను ఏర్పాటు చేసుకున్నాయి. భారత్- నేపాల్‌ల మధ్య సరిహద్దు సమస్య పరిష్కారంలో విషయంలో ఏ మూడో పక్షానికీ తావులేదు. ఇరుదేశాల సరిహద్దుకు సంబంధించి నేపాల్ ప్రధాని బాలేంద్ర షా చేసిన వ్యాఖ్యలను, అలాగే ఈ విషయంపై నేపాల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రకటనను పరిశీలించాం. భారత్-నేపాల్ సరిహద్దులో దాదాపు 98 శాతం గుర్తించాం. కొన్ని అపరిష్కృత విభాగాలు ఉన్నాయి. గండక్ నది ప్రవాహ మార్గం మారడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ప్రస్తుతం సంయుక్తంగా మ్యాపింగ్ చేస్తున్న సరిహద్దులోని గుర్తించిన విభాగాల్లో ఆక్రమణలు, నో మ్యాన్స్ ల్యాండ్‌లోకి చొరబాటు కేసులు కూడా ఉన్నాయి.“

**రణధీర్ జైస్వాల్, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి**

### ‘జమ్ముకశ్మీర్, లద్ధాఖ్ భారత్‌లో అంతర్భాగాలు‘

ఈయూ-పాకిస్థాన్ వ్యూహాత్మక చర్చల 8వ రౌండ్ అనంతరం జారీ చేసిన సంయుక్త పత్రికా ప్రకటనలో జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన ప్రస్తావనలను తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి హక్కు లేనివారు భారతదేశ అంతర్గత వ్యవహారాలపై వ్యాఖ్యానించకుండా ఉండాలని తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, లద్ధాఖ్ భారత్‌లో అంతర్భాగమని, అవి దేశం నుంచి విడదీయరానివని పేర్కొన్నారు.

### చర్చలు, దౌత్యం ద్వారానే శాంతి : రణధీర్ జైస్వాల్

లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులపైనా రణధీర్ జైస్వాల్ స్పందించారు. భారత్ పశ్చిమాసియా ప్రాంతంలోని పరిణామాలను నిశితంగా గమనిస్తోందన్నారు. శాంతి, స్థిరత్వం కోసం చర్చలు, దౌత్యమే మార్గమని తాము చెబుతూనే ఉన్నామని స్పష్టం చేశారు. మరోవైపు, అమెరికాలో అక్రమంగా నివసిస్తూ వాణిజ్య ట్రక్ డ్రైవర్లుగా పనిచేస్తున్న 30 మంది భారతీయులను అక్కడి అధికారులు అరెస్టులు చేయడంపైనా వివరణ ఇచ్చారు. భారత్ అక్రమ వలసలను ఏ విధంగానూ సమర్థించదని గుర్తు చేశారు. బహిష్కరణ కేసులు తమ దృష్టికి వచ్చినప్పుడల్లా అమెరికాకు సహకరిస్తామని చెప్పారు. అలాగే భారత్, బంగ్లాదేశ్‌లు 54 నదులను పంచుకున్నాయని చెప్పారు. ఈ నదులన్నింటికీ సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ఇరు దేశాల వద్ద ఒక ఉమ్మడి నదుల కమిషన్, ఒక వ్యవస్థీకృత ద్వైపాక్షిక యంత్రాంగం ఉందని వెల్లడించారు. వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ భారత పర్యటన గురించి వివరాలకు పంచుకున్నారు రణధీర్ జైస్వాల్. ఆమె జూన్ 1న జరగాల్సిన అంతర్జాతీయ బిగ్ క్యాట్స్ అలయన్స్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు భారత పర్యటనకు రావాల్సి ఉండగా, అది వాయిదా పడిందని వెల్లడించారు. ఇప్పుడు డెల్సీ రోడ్రిగ్జ్ జూన్ 3- 7 వరకు భారత్‌లో అధికారిక పర్యటన చేస్తారని తెలిపారు. తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగ్జ్ గతంలో వెనిజువెలా విదేశాంగ మంత్రిగా, ఆ దేశ ఉపాధ్యక్షురాలిగా పలుమార్లు భారత్‌లో పర్యటించారని చెప్పారు. ఇది ఆమె ఆరో భారత పర్యటనని పేర్కొన్నారు.

### తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరు..


## నీ అయ్యా జాగీరు కాదు: పొన్నం



ఇది మా అయ్యా జాగీరే అని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ ఇక్కడికి వచ్చి పీకేదేంటీ? అని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ పెయిడ్ ఆర్టిస్ట్ అని అభివర్ణించారు. తన దగ్గర డబ్బులు ఉంటే తాను కూడా పవన్‌తో ఒక క్యారెక్టర్ చేయిస్తానన్నారు. తెలంగాణపై పవన్ కళ్యాణ్ మరోసారి అక్కసు వెళ్లగక్కారంటూ మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తి పవన్ అని తెలిపారు. గద్దర్‌కు కారు కొనిచ్చా అని చెప్పినందుకు ముందు క్షమాపణ చెప్పాలంటూ పవన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. చనిపోయిన వారి గురించి మాట్లాడాల్సిన అవసరం ఏంటి? అని ఏపీ డిప్యూటీ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. తనకి ఆంధ్రాలోనే దిక్కు లేదని పవన్ చెప్పుకున్నాడని వ్యంగ్యంగా అన్నారు. ఉద్యమ సమయంలో కూడా ఆంధ్రా వాళ్ళని మేం ఏం అనలేదని పేర్కొన్నారు. మేం ఆంధ్రా వాళ్ళని ఏదో అన్నట్టు పవన్ కల్యాణ్ అబద్ధాలు చెబుతున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో ఏ బిల్లు చేసినా తలుపులు మూసే పాస్ చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. కొండగట్టుకు ఇచ్చిన పైసలు మీ అయ్యా జాగీరా? అని సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీటింగ్ పెట్టడం గెలకడం కాదా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ తిరిగితే జనాలు వస్తారు కానీ ఓట్లు వేయరని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ వచ్చినా, పోయినా మాకేం సంబంధం లేదన్నారు. తెలంగాణ ఎప్పుడైనా ఏపీ ప్రజలను స్వాగతిస్తూనే ఉంటుందని చెప్పారు. సినిమా నటుడిగా పవన్ ఎక్కడ తిరిగినా తమకేం ఇబ్బంది లేదన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్.

## రాజమహేంద్రవరం మెగాసిటీగా మారేలా అభివృద్ధి పనులు చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి



ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లతో సహా కొత్తగా 237 ఘాట్లను నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ సారి పుష్కరాల్లో పుణ్య స్నానాల కోసం 9 నుంచి 10 కోట్లమంది భక్తులు వస్తారని అంచనా వేశారు. మెగాసిటీగా రాజమహేంద్రవరం: పుష్కర ఘాట్లు, రోడ్లు, టెంట్లు, మరుగుదొడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం పనులు చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలనీ సీఎం ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, శానిటేషన్, తాగునీరు, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన సూచనల్ని పరిగణనలోకి తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. పుష్కరాల నిర్వహణతో పాటు రాజమహేంద్రవరం ఒక మెగాసిటీగా అభివృద్ధి అయ్యేలా పనులు చేపట్టాలని సూచించారు. కేవలం పుష్కరాలకు మాత్రమే పనులు పరిమితం చేయకుండా ప్రస్తుతం కల్పిస్తోన్న మౌలిక వసతులు గోదావరి పరివాహక ప్రాంతానికి ఆస్తిగా మారాలన్నారు. పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పుష్కరాల పనులు చేపట్టాలన్నారు. ఒక్కరోజులో 1 కోటి మంది: రాజమహేంద్రవరం, నర్సాపురం సహా వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ పరిధిలో రూ. 1,974 కోట్ల వ్యయంతో 1,660 పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో రూ. 1,080 కోట్ల విలువైన 1140 పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ‘ అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుపై మంత్రుల కమిటీతో పాటు వివిధ శాఖల అధికారులతో చర్చించారు. 2027 గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత పుష్కరాల్లో ఒక్క రోజులో అత్యధికంగా 58.26 లక్షల మంది భక్తుల పుష్కర స్నానం చేశారని ఈ సారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

## తెలంగాణలో జనసేన ఉంటుంది - మేం పోటీచేసి తీరతాం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లో ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమావేశానికి పోలీసులు అనుమతివ్వకపోవడంతో ఆయన నివాసంలో ప్రెస్ మీట్ ను నిర్వహించారు. విశ్లేషకుడి వ్యాఖ్యలతో గొడవ మొదలు: ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ఒక విశ్లేషకుడి వ్యాఖ్యల వల్ల గొడవ మొదలైందన్నారు. ఆ విశ్లేషకుడిపై కేసులు పెట్టిన విషయం మొదట్లో నాకు తెలియదన్నారు. నాకు తెలిశాక కేసులు పెట్టవద్దు, వదిలేయమని మా కార్యకర్తలకు చెప్పానన్నారు. ఆ తర్వాత ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ పెట్టి నన్ను తిట్టారని పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. ప్రత్యేక తెలంగాణ కోరుకున్న చెన్నారెడ్డి వల్లే సినీ ఇండస్ట్రీ హైదరాబాద్ వచ్చిందని పవన్ గుర్తు చేశారు. తెలంగాణలో మేం పోటీచేసి తీరతాం: తెలంగాణలో జనసేన ఉంటుంది, మేం పోటీచేసి తీరతామని పవన్ కల్యాణ్ సగర్వంగా ప్రకటించారు. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమన్నారు. తెలంగాణలో నేనే తిరుగుతానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. దశాబ్దాల బెదిరింపులకు చరమగీతం పలుకుతామన్నారు. ప్రతి అన్యాయాన్నీ ఎదుర్కొంటామని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. దశాబ్దాల బెదిరింపులకు చరమగీతం పలుకుతామన్నారు. ప్రతి అన్యాయాన్నీ ఎదుర్కొంటామని పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు. తెలంగాణను వ్యతిరేకించిన వాళ్లు పదవుల్లో కూర్చున్నారన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వాళ్లు ఎమ్మెల్యేలు అయ్యారన్నారు. 12 ఏళ్లుగా కిక్కురుమనకుండా కూర్చున్నానన్న పవన్, ఇది భారతదేశం అనుకున్నారా? పాకిస్థాన్, పాలస్తీనా అనుకున్నారా? అంటూ పవన్ ప్రశ్నించారు. ఇది నాదేశం నేను ఎక్కడైనా అడుగుపెడతానని పవన్ కల్యాణ్ ఎలుగెత్తి చాటారు. రాహుల్, ప్రియాంక దక్షిణాదిలో ఎక్కడైనా పోటీ చేయవచ్చు, ఇందిరాగాంధీ మెదక్‌లో, పీవీ నంద్యాలలో పోటీ చేశారని పవన్ గుర్తు చేశారు. నాపై మొదటి కేసు తెలంగాణలోనే: వైఎస్ బతికి ఉన్నప్పుడు మీ గొంతులన్నీ ఏమయ్యాయని పవన్ ప్రశ్నించారు. నాపై మొదటి కేసు తెలంగాణలోనే నమోదైందని పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. మమ్మల్ని భయపెట్టాలని చూస్తే భయపడేవాళ్లం కాదన్నారు. తెలంగాణలో ఎలా తిరుగుతావని కొందరు కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారన్నారు. వైఎస్ బతికి ఉన్నప్పుడు ఇదే కాంగ్రెస్ నేతలు ఊడిగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు వ్యతిరేకమని వైఎస్ చెప్పినా సరే కాంగ్రెస్ నేతలు ఆయనకే ఊడిగం చేశారన్నారు. కేసీఆర్ ఏపీలో బీఆర్ఎస్ శాఖ పెట్టినప్పుడు స్వాగతించానన్నారు. జనసేన మాజీ నేతలను బీఆర్ఎస్‌లోకి తీసుకున్నా స్వాగతించానని పవన్ వెల్లడించారు. కేవలం 2 వేల మందితో సభ పెట్టుకుంటాం అంటే అనుమతి ఇవ్వరా అంటూ పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విశ్లేషకులు ఇష్టానుసారం మాట్లాడినా మా అభిప్రాయం చెప్పకూడదా అంటూ పవన్ పేర్కొన్నారు. ప్రాంతీయ వాదమే కాంగ్రెస్ వాదమా?:పవన్ ప్రాంతీయ వాదమే కాంగ్రెస్ వాదమా అంటూ పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పద్ధతి అంటూ ఉందా? అన్నారు. జాతీయ పార్టీ ప్రాంతీయ వాదం గురించి మాట్లాడవచ్చా? అని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు తీసుకుని వెళ్లాలా అని చురకలంటించారు. పాశం యాదగిరి వంటి వారు కూడా నన్ను తిడితే బాధ పడ్డానని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ఇంట్లో



పాశం యాదగిరితో గతంలో చాలాసార్లు చర్చించానన్నారు. మీరు భయపెట్టే కొద్దీ మా గుండె మరింత గట్టిపడుతుందన్నారు. తెలంగాణ నేల నేర్పించిన విలువలనే పార్టీ సిద్ధాంతాలుగా పెట్టుకున్నాన్నారు. ప్రాంతీయత పేరుతో జాతీయవాదాన్ని బలహీనపరిస్తే జనసేన ఒప్పుకోదని తెగేసి చెప్పారు. ప్రాంతీయవాదాన్ని తీసుకొస్తే దేశ సుస్థిరత దెబ్బతింటుందన్నారు. ఉగ్రవాదం కంటే ప్రాంతీయవాదం హానికరమని పవన్ కల్యాణ్ తెలంగాణ నేతలకు హితవు పలికారు. సీపీఎం, ఎంఐఎం తెలంగాణను వ్యతిరేకించాయి:పవన్ తెలంగాణ ఏర్పాటును సీపీఎం, ఎంఐఎం వ్యతిరేకించాయన్నారు. సీపీఎం, ఎంఐఎంను మీరెందుకు ప్రశ్నించరన్నారు. జనసేనను మాత్రం ఎందుకు ప్రశ్నిస్తున్నారన్నారు. నేను ప్రెస్‌మీట్ పెడితే శాంతిభద్రతల సమస్య అవుతుందా? అంటూ పవన్ ప్రశ్నించారు. మళ్లీ గడీల పాలన తీసుకువస్తారా? అన్నారు. చనిపోయేందుకు సిద్ధపడే పార్టీ పెట్టానన్నారు. వైఎస్ బతికి ఉన్నప్పుడు లేవని గొంతులు ఇప్పుడు లేస్తున్నాయన్నారు.

## తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా? రావొద్దనడానికి మీరెవరు

మొదటి పేజీ తరువాయి




హైదరాబాద్: తెలంగాణ గడ్డతో తనకు రాజకీయాలకు అతీతమైన అనుబంధం ఉందని, ఈ ప్రాంతంపై ఎనలేని ప్రేమ ఉందని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. తనపై కొందరు చేస్తున్న విమర్శలు, బెదిరింపుల నేపథ్యంలో ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఘాటుగా స్పందించారు. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని సంచలన ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి తెరలేపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, “హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడతావని, ఇక్కడ నీకేం పని అని కొందరు నన్ను ప్రశ్నిస్తున్నారు. దాడులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. తెలంగాణ ఏమైనా వాళ్ల అయ్య జాగీరా? ఇలాంటి బెదిరింపులకు భయపడే వ్యక్తిని నేను కాదు,“ అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో తనను తిరగనివ్వబోమని బెదిరించినప్పుడు, తన ‘వారాహి‘ వాహనానికి అనుమతులు ఇచ్చి అండగా నిలబడింది తెలంగాణ సమాజమేనని ఆయన గుర్తుచేశారు. జనసేన పార్టీ పుట్టిందే తెలంగాణ నడిబొడ్డున అని, ఈ గడ్డ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత తనకు ఉందని స్పష్టం చేశారు.

### విభజన తీరునే వ్యతిరేకించాను

తాను ఎన్నడూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకం కాదని పవన్ కల్యాణ్ మరోసారి స్పష్టం చేశారు. “రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే నేను వ్యతిరేకించాను. పార్లమెంట్ తలుపులు మూసి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని తప్పుపట్టాను. అంతేగానీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేను ఎప్పుడూ గౌరవించాను. సామాజిక తెలంగాణ రావాలన్నదే నా ఆకాంక్ష“ అని వివరించారు. ఒక విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదాన్ని పట్టుకుని, ప్రెస్ క్లబ్‌లో సమావేశాలు పెట్టి మరీ తనను తిట్టే స్థాయికి కొందరు దిగజారారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్

తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలపైనా పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. “హైదరాబాద్‌లో నేను ఒక చెరువును కబ్జా చేశానని ఆరోపిస్తున్నారు. నేను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తున్నా. ఆ భూమిని పరిశీలించండి. నేను కబ్జా చేశానని నిరూపణ అయితే, ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకోవచ్చు. నాపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవచ్చు“ అని బహిరంగ సవాల్ విసిరారు. తనకు అధికారం మీద ఆశ లేదని, ఏపీలోనే తాను అధికారాన్ని ఆశించలేదని, అలాంటిది తెలంగాణలో ఎందుకు ఆశిస్తానని ప్రశ్నించారు. వ్యవస్థలో మార్పు తీసుకురావడమే తన ఏకైక లక్ష్యమని పునరుద్ఘాటించారు.

### క్షేత్రస్థాయిలోకి జనసేన.. ఇక పోటీయే

తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయాలని క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు ఎప్పటినుంచో కోరుతున్నారని పవన్ తెలిపారు. “ఇన్నాళ్లూ ఓపిక పట్టాం. ఇకపై ఊరుకునేది లేదు. నేనే స్వయంగా తెలంగాణ అంతటా పర్యటిస్తాను. రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుంది. ఎవరు ఏం చేసుకుంటారో చూసుకోండి“ అంటూ తన రాజకీయ ప్రత్యర్థులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. తనను విమర్శిస్తున్న నాయకులు కనీసం ఆదిలాబాద్ అడవుల్లో కూడా పర్యటించి ఉండరని, తనకు తెలంగాణలోని ప్రతి మూల తెలుసని ఆయన అన్నారు. ఈ ప్రకటనతో తెలంగాణ రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు ఢిల్లీలో సమావేశమవుతాయి

మొదటి పేజీ తరువాయి

లేదంటే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. మా నాయకులను తప్పుడు కేసుల్లో అరెస్టు చేస్తున్నారు. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన మాత్రం కొనసాగుతుంది. మరోవైపు, టీఎంసీని బలహీనపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలను బెదిరించడం లేదా లంచాలు ఇవ్వడం ద్వారా మీరు పార్టీని బలహీనపరచలేరు. వాస్తవానికి అలా చేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుంది. అలాగే, కోల్‌కతాలో నిరసనలు చేపట్టేందుకు మా పార్టీకి అనుమతి నిరాకరిస్తే, ఆందోళనను జాతీయ రాజధాని వరకు విస్తరిస్తాయి.“

**- మమతా బెనర్జీ, బంగాల్ మాజీ ముఖ్యమంత్రి**

మరోవైపు, పునరావాసం చూపకుండా వీధి వ్యాపారాలను తొలగించడం అన్యాయమని మమత అన్నారు. వీధి వ్యాపారుల పట్ల టీఎంసీ ప్రభుత్వం మానవీయతతో మెలిగిందని, ఈ పద్ధతిని ఎప్పుడూ అవలంబించలేదని చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో తాను కార్యకర్తలకు మద్దతుగా వారితో కలిసి పోరాడతానని వెల్లడించారు. మరోవైపు, తన మేనల్లుడు ఎంపీ అభిషేక్ బెనర్జీతోపాటు టీఎంసీ శ్రేణులపై దాడులను తీవ్రంగా ఖండించారు. రాణి రష్మోని రోడ్డులో నిరసనకు అనుమతి ఇవ్వకపోవటంతో ఎస్ప్లానేడ్‌లోని వై-ఛానల్ వద్ద మమతా ధర్నా చేపట్టారు. టీఎంసీ సీనియర్ నేతలు ఫిర్హాద్ హకీం, మదన్ మిత్ర, డెరెక్ ఓబ్రియన్, కల్యాణ్ బెనర్జీ, దోలాసేన్ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. స్టేజ్ వేసుకోవడానికి, మైక్రోఫోన్లు ఉపయోగించడానికి పోలీసులు అనుమతి ఇవ్వలేదని మమత తెలిపారు. ఆమె ప్రసంగిస్తున్న సమయంలో టీఎంసీ కార్యకర్తలు నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

### అభిషేక్ బెనర్జీపై దాడి

ఇదిలా ఉండగా, తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై శనివారం దాడి జరిగింది. ఎన్నికల అనంతరం బంగాల్ లో చెలరేగిన హింసలో బాధితులైన తమ పార్టీ మద్దతుదారులను పరామర్శించేందుకు సోనార్‌పుర్ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ క్రమంలో స్థానికులుగా భావిస్తున్న కొందరు దొంగ, దొంగ‘ అంటూ కేకలు వేస్తూ ఆయనపై దాడికి పాల్పడ్డారు. రాళ్లు, చెప్పులు, గుడ్లు విసిరారు. అంతటితో ఆగకుండా కర్రలతో దాడి చేశారు. అయితే, ఇదంతా ప్రణాళిక ప్రకారమే జరిగిందని, తాను సందర్శించిన ప్రాంతంలో పోలీసులను నియమించలేదని అభిషేక్ ఆరోపించారు. మరోవైపు, అభిషేక్‌పై జరిగిన భౌతిక దాడికి బాధ్యత బీజేపీదేనని మమత బెనర్జీ ఆరోపించారు. టీఎంసీ నేతకు తగినంత పోలీసు రక్షణ కల్పించకపోవడం బీజేపీ కక్ష సాధింపు రాజకీయాలకు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మరోవైపు, అభిషేక్ పై దాడికి సంబంధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య స్పందించారు. తమ పార్టీ ఇలాంటి పనులు చేయదని, ఇది పూర్తిగా స్థానికుల్లో నెలకొన్న ఆక్రోశం ఫలితంగా జరిగిన సంఘటనేనని ఆయన తెలిపారు. కాగా, అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడికి సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేశారు.

## నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై స్పందించిన భారత్

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ : భారతదేశం, నేపాల్ దేశాల మధ్య కొనసాగుతున్న సరిహద్దు వివాదాలు పూర్తిగా రెండు దేశాలకు సంబంధించిన అంతర్గత (ద్వైపాక్షిక) అంశాలని, ఇందులో మూడో పక్షం ప్రమేయానికి ఎంతమాత్రం ఆస్కారం లేదని భారత్ పునరుద్ఘాటించింది. ఇరు దేశాల మధ్య ఉన్న ఏవైనా విభేదాలను పరస్పర చర్చల ద్వారా, చారిత్రక ఆధారాల ఆధారంగానే పరిష్కరించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఇటీవల తమ పార్లమెంటులో చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందిస్తూ క్లారిటీ ఇచ్చింది.

### బ్రిటన్ ప్రమేయంపై నేపాల్ ప్రధాని వ్యాఖ్యలు..

### పార్లమెంట్‌లో తీవ్ర రగడ!

భారత్‌తో ఉన్న సరిహద్దు సమస్యల పరిష్కారం కోసం తాము కేవలం భారత్, చైనాలతోనే కాకుండా, బ్రిటన్ (యూకే) ప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరిపామని నేపాల్ ప్రధాని బాలేంద్ర షా పార్లమెంటులో వెల్లడించారు. భారతదేశాన్ని బ్రిటీషర్లు పరిపాలించిన కాలం నాటి చరిత్రతోనే ఈ సమస్య ముడిపడి ఉన్నందున, బ్రిటన్ కూడా ఈ విషయంలో చొరవ చూపాలని తాము కోరుకుంటున్నట్లు



ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, భారత్ తమ భూభాగంలోకి చొరబడినట్లే.. నేపాల్ కూడా కొన్ని ప్రాంతాల్లో భారత భూభాగాలను ఆక్రమించుకుందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు నేపాల్ పార్లమెంటులో తీవ్ర దుమారానికి దారితీశాయి. దేశ అధికారిక వైఖరిని ప్రధాని బలహీనపరిచారంటూ ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ప్రతిపక్షాల తీవ్ర నిరసనల నేపథ్యంలో నేపాల్ విదేశాంగ శాఖ వెంటనే నష్టనివారణ చర్యలు చేపట్టింది. ప్రధాని చేసిన వ్యాఖ్యలు అధికారిక సరిహద్దు ఆక్రమణల గురించి కావని, కేవలం ‘దస్‌గజ’ (నో-మ్యాన్స్ ల్యాండ్) పరిధిలో ఇరు దేశాల పౌరులు చేసుకుంటున్న భూ వినియోగానికి సంబంధించినవి మాత్రమేనని స్పష్టం చేసింది. లిపులేఖ్, కాలాపానీ, లింపియాధురా ప్రాంతాలపై నేపాల్ అధికారిక వైఖరిలో ఎలాంటి మార్పు లేదని వివరించింది.

### సుగౌలీ ఒప్పందం..

### లిపులేఖ్, కాలాపానీ వివాదం

1816 నాటి ‘సుగౌలీ ఒప్పందం’ ప్రకారం కాలాపానీ, లిపులేఖ్, లింపియాధురా ప్రాంతాలు తమవేనని నేపాల్ సుదీర్ఘకాలంగా వాదిస్తుండగా, ఆ భూభాగాలు తమ దేశంలోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలో అంతర్భాగమని భారత్ స్పష్టం చేస్తోంది. తాజాగా నేపాల్ ప్రధాని ఈ వివాదంలోకి బ్రిటన్‌ను లాగడానికి ప్రయత్నించినప్పటికీ.. భారత్ మాత్రం ఏ దేశ మధ్యవర్తిత్వాన్నయినా ఖచ్చితంగా తిరస్కరిస్తూ, ఇది కేవలం ఢిల్లీ, ఖాట్మండుల మధ్యే పరిష్కారం కావలసిన అంశమని గట్టిగా తేల్చిచెప్పింది.

వార్త నిర్భయం
బుధవారం 03 జూన్ 2026

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాగరాజు .





వర్ధన్నపేట, ప్రతినిధి జూన్ 2 (వార్త నిర్భయం)

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనేది ఎన్నో ఏళ్ల ఉద్యమాలు, త్యాగాలు, ఆకాంక్షలు, అమరవీరుల బలిదానాల ఫలితమని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు మరియు అమరవీరుల త్యాగాలను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరువదని అన్నారు..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తూ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రస్తుతం ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలన, ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతోందని అన్నారు..ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు...ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేసి, ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీటి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు...రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలు పెంచడం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించడం వంటి అంశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా "ప్రజల ప్రభుత్వం"గా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు...తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులర్పిస్తూ, రాష్ట్ర సాధన కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ మరియు రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు...ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు, యువజన నాయకులు, మహిళా నాయకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు.

### సమసమాజ స్థాపనే కాంగ్రెస్ ధ్యేయం.
### రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుక
### సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు.
### బండి రమేష్ కాంగ్రెస్ నేత



హైదరాబాద్ జూన్ 2 (వార్త నిర్భయం) తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సమసమాజ స్థాపనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టిపిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం కూకట్పల్లి నియోజకవర్గంలోని బోయినపల్లి, బాలానగర్, మూసాపేట ప్రాంతాల్లో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ కోసం ప్రజలు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. గత పాలనలో ప్రజలను మోసం చేసి, అభివృద్ధి పేరుతో దోపిడీ చేశారని ఆరోపించారు. "దోచుకోవడం, దాచుకోవడం తప్ప గత ప్రభుత్వానికి వేరే అజెండా లేదు" అని విమర్శించారు. ప్రజా ప్రభుత్వంలో సంక్షేమే ప్రధాన అజెండాగా ముందుకు వెళ్తున్నామన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్ తో రైతుల జీవితాల్లో వెలుగులు తెచ్చామన్నారు. మహిళల సాధికారత కోసం మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కోటి మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. సూపర్ మార్కెట్లు, పెట్రోల్ బంకులు కేటాయించి ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామన్నారు.ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నామన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని వెల్లడించారు. సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలకు పోషకాహారం అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తెలంగాణ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం.

### వారి ఆశయ సాధనే నిజమైన నివాళి
### అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం..
### తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల్లో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి




వనపర్తి బ్యూరో, జూన్ 2 (వార్త నిర్భయం): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. అమరవీరుల ఆశయ సాధనే వారికి మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.మంగళవారం వనపర్తి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, తెలంగాణ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య పునాదులపై సరికొత్త తెలంగాణను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సాధనలో అమరవీరుల బలిదానం ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా తెలంగాణను సుభిక్షంగా తీర్చిద్దడానికి ప్రభుత్వం శుద్ధితో పనిచేస్తుందని స్పష్టం చేశారు.అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. సమసమాజ స్థాపన, పేదల అభ్యున్నతే అమరవీరుల కల అని గుర్తు చేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన. బిఆర్ఎస్.

### అనేక త్యాగాలు. పొరాలు. ఉద్యమాల ఫలితంగా. తెలంగాణ రాష్ట్ర ఏర్పాడింది.
### మాజి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



వరంగల్ ప్రతినిధి జూన్ 02 (వార్త నిర్భయం) తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత రాష్ట్ర సమితి పార్టీ వరంగల్ జిల్లా కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ ప్రజల 60 ఏండ్ల స్వప్నం సాకారమైన రోజు జూన్ 2 అని పేర్కొన్నారు. అనేక త్యాగాలు, పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ సాధనకు ప్రధాన శిల్పిగా నిలిచిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ 14 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పోరాడి, మహాత్మా గాంధీ చూపిన శాంతియుత మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని అన్నారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో 10 సంవత్సరాల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాజకీయ పార్టీలను ఒప్పించి తెలంగాణ రాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.అలాగే కేసీఆర్ పాలనలో కాలేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ వంటి ప్రపంచ స్థాయి సాగునీటి ప్రాజెక్టులు నిర్మించబడ్డాయని, ఉద్యమ సమయంలో ప్రజలు కోరుకున్న నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యాలను బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దఎత్తున నెరవేర్చిందని తెలిపారుకాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు, యువత, మహిళలు, కార్మికులు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై నిరంతరం పోరాటం చేస్తామని, ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని ప్రతిజ్ఞ చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ గారిని మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రిగా చేసే దిశగా బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మొదట తెలంగాణ తల్లి మరియు ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ అమరవీరులను స్మరించుకొని వారికి శ్రద్ధాంజలి ఘటించారు.తదనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం భారత రాష్ట్ర సమితి పార్టీ జెండాను ఎగురవేసి తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు.మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ నేతలు, కార్యకర్తలు ఆనాటి పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ తెలంగాణ సాధనలో జరిగిన ఉద్యమ ఘట్టాలను స్మరించుకున్నారు. కార్యక్రమం ముగింపులో ప్రజలకు పండ్ల పంపిణీ నిర్వహించారు.

## అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి.

### త్యాగాలు చిరస్మరణీయం, ఆశయాల సాధనే నివాళి'
### వనపర్తి వివేకానంద చౌరస్తాలో స్మారక స్థూపం



వనపర్తి బ్యూరో, జూన్ 2 (వార్త నిర్భయం):

తెలంగాణ సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వారి పోరాట స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం వనపర్తి పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపాన్ని ఎమ్మెల్యే గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. అమరవీరులకు పుష్పాంజలి ఘటించి వారి త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వెనుక అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటం ఎంతో గొప్పదని కొనియాడారు. అమరవీరుల స్థూపం వారి త్యాగాలను గుర్తు చేస్తూ భావితరాలకు స్ఫూర్తినిచ్చే స్మారక చిహ్నంగా నిలుస్తుందని తెలిపారు.అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమసమాజ స్థాపన, పేదల బతుకుల్లో వెలుగులు నింపడమే అమరవీరులకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం : కుడా కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ



హనుమకొండ ప్రతినిధి జూన్ 2 ( వార్త నిర్భయం )

హనుమకొండ: తెలంగాణ రాష్ట్ర 13వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు హనుమకొండలోని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ,కుడా వైస్ చైర్మన్, సిపివో (జూ) అజిత్ రెడ్డి తో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రజలకు, సిబ్బందికి తెలంగాణ ఆవిర్భవ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కొండపర్తి గ్రామ సర్పంచ్ కంజర్ల అశోక్ రావు...



వర్ధన్నపేట, ప్రతినిధి జూన్ 2 (వార్త నిర్భయం ) తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు కొండపర్తి బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కట్కూరి చంద్రమౌళి జండా ఎగరవేయడం జరిగింది ఈ సందర్భంలో కొండపర్తి సర్పంచ్ అశోక్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనేది ఎన్నో ఏళ్ల ఉద్యమ త్యాగాలు ఆకాంక్షలు అమరవీరుల బలిదానా ఫలితం అనే పేర్కొన్నారు తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల ఘన నివాళులు అర్పిస్తూ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కొండపర్తి గ్రామ వార్డ్ మెంబర్లు బిఆర్ఎస్ నాయకులు ప్రజా ప్రతినిధులు మహిళా నాయకులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కల్దుర్కి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



బోధన్ గ్రామీణ ప్రతినిధి జూన్ 2 (వార్త నిర్భయం) తెలంగాణ అవతరణ దినోత్సవ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఈరోజు మన కల్దుర్కి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) కార్యాలయం వద్ద వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. సంఘ అధ్యక్షులు గింజుపల్లి శరత్ గారి చేతుల మీదుగా జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, విజయవంతంగా పూర్తయింది. ఈ కార్యక్రమంలో గణపతి రెడ్డి, సర్పంచ్లు నరేందర్ రెడ్డి, సాయికుమార్ , మాధవ్ రావు, సిరిగిరి రాముగౌండ డైరెక్టర్ కార్యదర్శి శ్రీనివాస్ చారి సిబ్బంది, పాలక వర్గ సభ్యులు, స్థానిక రైతులు మరియు గ్రామ పెద్దలు పాల్గొని, అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వేడుకను విజయవంతం చేశారు.కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మరియు సంఘ గ్రామ ప్రజలందరికీ శుభాకాంక్షలు

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ

## అమరవీరులకు నివాళి.. లబ్ధిదారులకు ఆస్తులు, ఆర్థిక సహాయం పంపిణీ చేసిన మంత్రి కొండా సురేఖ





వరంగల్ ప్రతినిధి జూన్ 02 (వార్త నిర్భయం)

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లోని ఖిలా వరంగల్ ఖుష్‌మహల్ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెతో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీసీపీ అంకిత్ కుమార్, డి ఎఫ్ ఓ నిఖిత అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు.అనంతరం ఖుష్‌మహల్‌లో నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పతాకావిష్కరణ చేసి జిల్లా ప్రగతి సందేశాన్ని ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలను, స్వాతంత్ర్య సమరయోధులను మంత్రి సన్మానించారు.సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆస్తులు, ఆర్థిక సహాయం పంపిణీ చేశారు. అలాగే వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్, డీఎఫ్‌వో నిఖిత, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర చిరస్మరణీయం: బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు విజయ ప్రకాష్ రెడ్డి

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విజయ ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, కార్యక్రమానికి హాజరైన డివిజన్ నాయకులు, పెద్దలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.





తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001లో కేసీఆర్ రాష్ట్ర స్థాయి ఉద్యమాన్ని ప్రారంభించి, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి, వారి మద్దతును కూడగట్టి ఉద్యమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.తెలంగాణ ఏర్పడిన అనంతరం తొమ్మిదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ విద్య, వ్యవసాయం, ఐటీ, విద్యుత్ తదితర అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు పథకం ద్వారా సుమారు రూ.72 వేల కోట్లను అందించి రైతాంగానికి అండగా నిలిచారని తెలిపారు.విద్యుత్ రంగంలో భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణంతో పాటు వేల కిలోమీటర్ల విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు దాదాపు రూ.85 వేల కోట్ల వ్యయం చేసి రాష్ట్రాన్ని విద్యుత్ స్వావలంబన దిశగా నడిపించారని అన్నారు. ఒకప్పుడు అంధకారంలో ఉన్న తెలంగాణకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించిన ఘనత కూడా కేసీఆర్‌కే చెందుతుందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్లు సహా అనేక వర్గాల ప్రజలు జీవనోపాధి సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు."తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో" అనే నినాదంతో సాగిన ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ బంగారు తెలంగాణగా రూపుదిద్దుకుందని, రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని విజయ ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తాళ్లపల్లి జనార్దన్ గౌడ్ తాళ్లపల్లి రామస్వామి టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కోటేశ్వరరావు, సంపత్, అప్సర్, మల్లారెడ్డి, ఎన్ శ్రీధర్ రావు, కృష్ణయ్య, నారాయణ పాల్గొన్నారు

# ఉదండాపూర్ సర్పంచ్ తంగెళపల్లి శేఖర్ కాంగ్రెస్ పార్టీ లో చేరిక





జడ్చర్ల, జూన్ 02 వార్త నిర్భయం జడ్చర్ల మండలం బీఆర్ఎస్, బీజేపీలకు భారీ షాక్ తగిలింది. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సారథ్యంలో ఉదండాపూర్ బీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ శేఖర్, వల్లూరు గ్రామ బీజేపీ వార్డు సభ్యుడు వెంకటేష్ మంగళ వారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో మంత్రి వారికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, "రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాల నాయకులు కాంగ్రెస్ వైపు వస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇంకా చేరికలుంటాయి" అని అన్నారు.

# మహబూబ్‌నగర్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు: మంత్రి జూపల్లి చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి





జడ్చర్ల, జూన్ 02 వార్త నిర్భయం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు, అమరవీరులు చేసిన త్యాగాల ఫలితంగానే నేడు తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది" అని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. "రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణం. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి" అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులను మంత్రి, ఎమ్మెల్యేలు అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, ఎస్పీ డి. జానకి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అరగుండ్లు కొట్టుకుని ఆవేదన రేవంత్ అమలు కానీ హామీలు కొడంగల్లో రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా వికలాంగుల వినూత్న నిరసన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజునే అర్థనగ్న ప్రదర్శన.




హైదరాబాద్ జూన్ 2 (వార్త నిర్భయం)

కొడంగల్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్లో వికలాంగుల ఆవేదన బయటపడింది.భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు అరగుండ్లు కొట్టుకుని అర్థనగ్న ప్రదర్శనతో ఆవేదన దీక్ష చేపట్టారు.అసెంబ్లీ ఎన్నికల ముందు పిసిసి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి వికలాంగులకు ఇచ్చిన హామీలు:పెన్షన్ 6000 రూపాయలకు పెంపు 100% ఉచిత ప్రయాణంబ్యాక్లాగ్ ఉద్యోగాల భర్తీ అట్రాసిటీ చట్టం 2016 సమర్థ అమలుప్రత్యేక సంక్షేమ శాఖ ఏర్పాటు2.5 ఏళ్లు గడిచాయి. ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. వికలాంగుల సమాజాన్ని అణిచివేస్తున్నారు" అని గిద్దె రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే హస్తం పార్టీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ఉద్యమిస్తాం. కొడంగల్లో రేవంత్ రెడ్డిని ఓడించడమే మా టార్గెట్" అని స్పష్టం చేశారు.దీక్ష అనంతరం కొడంగల్ తాసిల్దార్ కు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు, జిల్లా అధ్యక్షులు పసుల చంద్రయ్య, రాష్ట్ర నాయకులు కడియ నరేష్, మహిళా నాయకురాలు అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితురాలు జయసుధ ని పరామర్శించిన తూడి శారద మేఘారెడ్డి.



వనపర్తి బ్యూరో జూన్ 2 (వార్త నిర్భయం)

ఇటీవల కేరళలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన మున్సిపల్ వైస్ చైర్మన్ సతీమణి జయసుధ నీవనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సతీమణి తూడి శాదారెడ్డి మంగళవారం పరామర్శించారుఈ సందర్భంగా ఆమె రోడ్డు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు మెరుగైనంతవరకు చికిత్స అవసరమని ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటూ త్వరగా కోలుకోవాలని ఆశించారు మనిషి మనోధైర్యమే వైద్య చికిత్స కంటే బాగా పనిచేస్తుందని ధైర్యం కోల్పోకూడదని ఎలాంటి అవసరం ఉన్న అండదండగా ఉంటామని ధైర్యం చెప్పారు

# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ తిరోగమనంలో: మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి

## బీఆర్ఎస్ పదేళ్ల పాలనలోనే రాష్ట్రం నెం.1: జడ్చర్లలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి



జడ్చర్ల, జూన్ 02: వార్త నిర్భయం

14 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలో పయనిస్తోందని మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం జడ్చర్ల పట్టణంలోని మాజీ మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండా, బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, "కేసీఆర్ గారితో ఉద్యమంలో పాల్గొనడం నా అదృష్టం. తెలంగాణ కోసం పదవులు సైతం త్యాగం చేసి కొట్లాడాం. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్‌గా నిలబెట్టాం" అని గుర్తు చేశారు."రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విఫలమైంది. కాంగ్రెస్ విధానాలు తెలంగాణకు శాపంగా మారాయి" అని మాజీ మంత్రి విమర్శించారు. వడ్లు, మొక్కజొన్న కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టారని, హమాలీలు, లారీల కొరత, మిల్లర్ల దోపిడీతో రైతులు అరిగోస పడ్డారని ఆరోపించారు."రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు రైతులకు మద్దతుగా పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాం. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ శ్రేణులు పోరాడాలి" అని కార్యకర్తలకు మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా ఐలోని మండలం తాసిల్దార్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

## జాతీయ జెండా ఆవిష్కరించిన తాసిల్దార్ కనపర్తి విక్రమ్ కుమార్



వర్ధన్నపేట నియోజకవర్గం ప్రతినిధి జూన్ 2 ( వార్త నిర్భయం )తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఐలోని మండల్ తాసిల్దార్ కార్యాలయంలో కనపర్తి విక్రమ్ కుమార్ జెండా ఎగరవేయడం జరిగింది ఈ సందర్భంగా కనపర్తి విక్రమ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనేది ఎన్నో ఏళ్ల ఉద్యమ త్యాగాలు ఆకాంక్షాలు అమరవీరుల బలిదానాల ఫలితం అనే పేర్కొన్నారు తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల ఘన నివాళులు అర్పిస్తూ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ప్రతి ఒక్క ఉద్యమకారుడి కి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఐలోని మండల్ తాసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.